# వెంటవచ్చేది



"ఒక ఇల్లు లేదు - వాకిలి లేదు - పిల్లలు పెద్దవాళ్ళయ్యారు - ఇద్దరమ్మాయిలకు పెళ్లి చేయాలి - అబ్బాయికి ఉద్యోగం లేదు - ఈయన ఈ ఏడాది రిటైర్ అయిపోతున్నారు" ఆవేదనతో చెప్పింది ఆదిలక్ష్మి.

"అవును - ఎల్లకాలం ఎవరు మటుకు పనిచేయగలరు?" రంగాచారి గారు అన్నారు. ఆయన ఒక సంఘ సంస్కర్త! శాస్త్రాలపైన పట్టువున్న పెద్దమనిషి.

"నిజమే సార్! కానీ మిగతా వాళ్ళు జాగ్రత్త పడ్డారు గదా - ఈయన సీట్లో లక్షలు సంపాదించినవాళ్ళున్నారు - నాలుగిళ్ళు కట్టుకున్నారు - పెళ్ళాం పిల్లలను బాగా చూసుకున్నారు - నగలు చేయించారు - అమెరికా చదువులు చెప్పిస్తున్నారు - ఈయన మటుకు మడికట్టుకు కూర్చుని నయాపైసా పై సంపాదన లేకుండా మమ్మల్ని అన్యాయం చేశారు" వాపోయింది ఆదిలక్ష్మి.

"తప్పమ్మా! అందుకు నువ్వు గర్వించాలి. మీ ఆయన్ని అభినందించాలి. ఈ కాలంలో ఇటువంటి ధర్మపరులు - సత్యహరిశ్చంద్రులు ఉన్నందుకు ప్రోత్సహించాలి. ఇంటి ఇల్లాలుగా ఆయనకు వెన్నుదన్నుగా ఉండాలి" చెప్పారు.

"సత్య హరిశ్చంద్రుడు ఏం సుఖపడ్డాడు? - అన్నీ పోగొట్టుకున్నాడు - పెళ్ళాం బిడ్డల్ని నానా కష్టాలు పెట్టాడు తన స్వార్థం కోసం. ఒక్క అబద్ధం చెబితే ఆయన సొమ్మేంపొయ్యేది? - అందర్నీ బాధపెట్టి ఆయనేం బావుకున్నాడు?" తిరస్కారంగా అంది ఆదిలక్ష్మి.

"అమ్మా! పురాణాలను సరిగా అర్థం చేసుకోకపోతే మన బ్రతుకులు నాశనం అవుతాయి. అవి మానవులు ఎలా నడుచుకోవాలో నిర్దేశిస్తూ ఉంటాయి. మన సంస్కారాన్ని బట్టి మనం అర్థం చేసుకుంటాం -" బాధగా చెప్పారు.

"ఆ కాలం వేరు - ఈ కాలం వేరు. ఇది కలికాలం - ఇంకొకత్తైతే ఈయన్ని వదిలేసి ఎప్పుడో పారిపోయేది!" ఆదిలక్ష్మి చెప్పింది.

"నువ్వింత బాధపడుతున్నావు కదా! నీకొక విషయం చెబుతున్నాను... ప్రపంచాన్ని జయించిన అలెగ్జాండర్ గ్రేట్ అతి చిన్నవయసులో చనిపోతూ ప్రపంచానికి ఒక సందేశం యిచ్చాడు. తన సమాధిలో తన చేతుల్ని పైకి పెట్టి కట్టి సమాధి చేయమన్నాడు - ఎందుకో తెల్సా? ఇంత పెద్ద రాజ్యం సంపాదించినా నేను పోయేటప్పుడు కనీసం ఒక చిన్న సూది కూడా నా వెంట తీసుకుపోవడం లేదు అని అందరూ తెల్సుకోవాలని" రంగాచారి చెప్పారు.

"ఓహో! అన్ని లక్షలమందిని చంపి - అన్ని రాజ్యాలు జయించి, అంత వైభవం అనుభవించిన తరువాత అతనికి జ్ఞానోదయం అయిందా?" వ్యంగ్యంగా అడిగింది.

"నిజమే కానీ - కనీసం ఆయనకి అప్పటి కన్నా అయింది. మనకి ఇప్పటికీ కావడం లేదుగా! మనం వచ్చేటప్పుడు ఏం వెంట పెట్టుకు వచ్చామో ఆలోచించి చెప్పమ్మా!" రంగాచారి గారు అడిగారు.

"ఏమో నాకైతే గుర్తులేదు సార్!" గడుసుగా చెప్పింది ఆదిలక్ష్మి.

"బాగా ఆలోచించమ్మా!"

"ఏమో! పాపపుణ్యాలను-"

"అవి నువ్వు గుర్తుపట్టగలవా?"

"తెలియదు-"

**వియోగి**

"నీ శరీరాన్ని తెచ్చావా లేదా?"

"ఈ తిప్పలన్నీ అందుకోసమే కదాసార్! కాయం కోసమే కదా ఈ కష్టాలన్నీ'!!

"బాగా షోకులు చేస్తాం - పన్నీట స్నాన మాడిస్తాం - రాళ్ళు కూడా గుచ్చుకోకూడదని పాదరక్షలు వేస్తాం - శరీరం కందిపోకూడదని ఖరీదైన దుస్తులు ధరిస్తాం - కాస్త ఆకలేస్తే ఆత్మారాముడ్ని తృప్తి పరుద్దామని పంచభక్ష్య పరమాన్నాలు ఆరగిస్తాం! వానకి, ఎండకీ నానకూడదు, ఎండకూడదని చలువరాతి మేడ ల్లో కూర్చోబెడతాం - అయినా దానికేమన్నా కాస్త విశ్వాసముందా?"

"ఎందుకు స్వామీ - మన శరీరం మనిష్టం గదా?"

"అవునా? - మరి చనిపోతే అది మన వెంటరావాలి కదా? రావడం లేదు. పుట్టే టప్పుడు శరీరాన్ని తెచ్చుకున్నాం - పోయే టప్పుడు దాన్ని కూడా ఇక్కడే వదిలేసి వెళు తున్నాం - ఈ సత్యాన్ని గ్రహిస్తే అది సంపాదిం చలేదు, ఇది సంపాదించలేదని ఎందుకమ్మా మనం విచారపడటం?" రంగాచారి గారు ఆ మాటలు చెప్పి మౌనముద్రలోకి వెళ్ళిపోయారు.

ఆదిలక్ష్మి నమస్కారం చేసి, లేచి వచ్చి - యింటికి బయలుదేరింది.

ఇంట్లో భర్త శ్రీమన్నారాయణ ఎదురు చూస్తున్నాడు.

'ఏమేవ్! ఎక్కడికెళ్లావు యింతసేపు? ఇప్ప టిదాకా పెళ్ళిళ్ళ పేరయ్య అప్పలనరసయ్య ఎదురుచూసి వెళ్లాడు" విసుగ్గా చెప్పాడు.

"ఏముంది? మనసు బాగాలేకపోతే అలా గుడికి పోయి - ఆ పక్కనే ఉన్న రంగాచారి గారింటికి వెళ్ళి వచ్చాను. ఏం చెప్పాడేంటి?" నిరాసక్తిగా అడిగింది.

"మనిద్దరమ్మాయిలకూ దాదాపు పెళ్ళిళ్ళు ఖాయమైపోతాయని చెప్పాడు. ఆరునెలల్లో ఇద్దరికీ చేసేస్తానన్నాడు. మనల్ని డబ్బు రెడీ చేసుకోమన్నాడు" ఆనందంగా చెప్పాడు శ్రీమ న్నారాయణ.

"సరే...! అవే ఉంటే వీళ్ళ పెళ్ళిళ్ళకు ఇంత కష్టపడాల్సివచ్చేదా మనం?" ఈసడింపుగా అడిగింది.


"సరేలే - వీళ్ళిద్దరికీ బియిడి ఉందని వాళ్ళు ఒప్పుకుంటున్నారట. భవిష్యత్తులో టీచరు ఉద్యోగం చేయించుకోవచ్చులే అని. ఎంత లేదన్నా ఒక్కొక్కళ్ళకీ రెండు లక్షలపైచిలుకు అవుతుంది - అయిదు లక్షలదాకా ఖర్చవు తుంది".

"ఎక్కడ్నుంచి తీసుకువస్తారో తీసుకురం డి... నేను చెప్పింది ఏనాడు విన్నారు కనుక? ఇంకో సంవత్సరం అయితే మీ మొహం చూసే వాళ్ళు ఎవరూ ఉండరు. కనీసం ఆ వెంకటేశం అన్నయ్యను చూసి నేర్చుకోవాల్సింది" ఈసడిం పుగా అంది.

"ఆ డబ్బులు మనకు అరగవే! సక్రమంగా సంపాదిస్తున్న దానికే ఓపట్టాన అరగడం లేదు" మొహం మాడ్చుకుని వెళ్ళిపోయాడు శ్రీమన్నా రాయణ.

"అమ్మా! ఉన్న డబ్బంతా చెల్లాయిల పెళ్ళి ళ్ళకే తగలేస్తే నాగతేం కాను? నాకు ఉద్యోగం లేదు, ఇక్కడ ఎంత ప్రయత్నించినా సరైన ఉద్యో గాలు రావడం లేదు" విచారంగా అడిగాడు సుపుత్రుడు సుధాకర్.

"ఆడపిల్లల పెళ్ళి బాధ్యత తల్లిదండ్రులది. ఆయన పోస్టులో ఉండగానే వాళ్ళ పెళ్ళిళ్ళు చేస్తే ఓ మాదిరి సంబంధాలు వస్తాయి. ఆడ పిల్లల్ని ఎంత చదివించినా మనింట్లో ఉంచు




కోలేంగదా!" ఆదిలక్ష్మి వివరించింది.

"చెయ్యండమ్మా! కానీ చేసేముందు మీకు కొడుకు కూడా ఉన్నాడు - వాడి భవిష్యత్తు కూడా చూసే బాధ్యత మీదేనని మర్చిపోకండి" సుధాకర్ చెప్పి బయటికెళ్లిపోయాడు.

ఆ మాటే ఆమె భర్తకు చెప్పింది.

"వెధవకి ఉద్యోగం వెతుక్కోవడం రాకపోతే మనమేం చేయగలం? బిటెక్ చదివించాం. చాలదా? వాడి చదువుకు ఎన్ని లక్షలు తగలేశాను? రెసిడెన్షియల్ చదువులు - కోచింగులు - పైగా కంప్యూటర్ కోర్సులకు లక్షలు తగలేశాం. వీడి క్లాసుమేట్లందరూ మంచి జాబుల్లో ఫిక్సు అయిపోయారు. వీడింకా మీనమేషాలు లెక్కపెడుతున్నాడు" విసుగ్గా అన్నాడు.

"వాడుమటుకు ఏం చేస్తాడండీ! అమెరికా వెళదామని మంచి జాబ్ కోసం ప్రయత్నిస్తున్నాడు - మంచి ప్లేస్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నాడు".

"దేనికైనా శాటిస్‌ఫ్యాక్షన్ కావాలి! చిన్న ఉద్యోగాలంటూ కొన్నిటిని వీడు తిరస్కరించాడు. ఒకేసారి పెద్ద ఉద్యోగాలొస్తాయా? నేను గుమాస్తాగా ప్రారంభించి ఆఫీసర్ని అయ్యాను కదా - ఇంత పెద్ద పోస్టుకు ఎదిగాను." శ్రీమన్నారాయణ విచారంగా చెప్పాడు.

"మన పిల్లలు మనకంటే తెలివిగల వాళ్ళు - వాళ్ళనెందుకులెండి... మీ ఆదర్శం తీసుకోమనడం?" పెడసరంగా చెప్పింది.

కాసేపటికి సీత, గీతలు వచ్చారు క్లాసు నుంచి.

"అమ్మా! ఈ బోడి టీచరు జాబ్స్ మేం చేయలేకపోతున్నాం - ఒకటే సతాయింపు - ఎంత చెప్పినా తృప్తి ఉండదు" సీత చెప్పింది.

"వాడిచ్చే రెండువేలకు ఒక ఆదివారం లేదు. పండగలేదు - ఒక టైము లేదు - ఎప్పుడూ పిల్లలకు పాఠాలు చెబుతూనే ఉండాలి! మానేస్తే రోగం కుదురుతుంది!" పెద్దకూతురు

గీత చెప్పింది.

"ఎవరిది?" అడిగాడు శ్రీమన్నారాయణ.

"వాడిదే - ఆ కరెస్పాండెంట్ గాడిది..." చెప్పింది గీత.

"కాదే - మన రోగం కుదురుతుంది - నువ్వు కాకబోతే ఇంకో బోడి పీతని తీసుకు వస్తాడు. బయట ఎంతమంది ఖాళీగాలేరు - పాఠాలు చెప్పడానికి" సీత చెప్పింది.

"ఇదంతా నాన్న మూలంగా వచ్చింది! మనల్ని కూడా అన్నయ్యలాగా బిటెక్ చదివిస్తే మంచి ఉద్యోగం దొరికేది" గీత ఆవేదనతో చెప్పింది.

"ఇంతమందిని బిటెక్‌లు చదివించే టెక్కు మీనాయనకెక్కడిదే? ఏదో ఊళ్ళో ఉన్న కాలేజీ ల్లో మిమ్మల్ని ఓ సైన్సు డిగ్రీ - బియిడి చేయిం చగలిగాడు!" ఆదిలక్ష్మి చెప్పింది.

"పోనీలే అమ్మా! కాస్త చదివిద్దామన్న ఆలోచన వచ్చింది నాన్నకు - ఆడపిల్లలకు చదువెందుకని ఇంట్లో కూర్చోబెట్టలేదు" సీత చెప్పింది.

అది పొగడ్తో - తెగడ్తో అర్థం కాలేదు శ్రీమన్నారాయణకు.

"నేను చిరుద్యోగిని - నాకు చేతనైనంతలో నేను చేశాను. మీరు మీ భవిష్యత్‌ని నిర్మించు కోండి... మీకు పెళ్ళి చేయడంతో నా బాధ్యత తీరిపోతుంది. మీ ఆయనల్ని తోడు తీసుకుని మీరేం చదువుతారో - ఏ ఉద్యోగాలు చేస్తారో మీ యిష్టం. ఇంకా పై చదువులు కావాలంటే చదువుకోండి" నిర్లిప్తంగా చెప్పాడు శ్రీమన్నా రాయణ.

"కన్నతండ్రే మా గురించి ఆలోచించన ప్పుడు - ఆ వచ్చేవాడు ఆలోచిస్తాడా? ఇంక నీకు చదువెందుకు దండగ అంటాడు" గీత చెప్పింది.

"ఆడదాని తెలివితేటలన్నీ మొగుడ్ని ఆడిం చడంలో ఉంటాయి. మీ వాళ్ళను కొంగున కట్టేసుకోండి - మీ కోరికలు తీర్చుకోండి" హితోపదేశం చేసింది ఆదిలక్ష్మి.

"మరి యిన్ని తెలివితేటలున్నదానివి - నాన్న నీమాట ఎందుకు వినడం లేదమ్మా!" గీతకు సందేహం వచ్చింది.

"అది నా ఖర్మమమ్మా! నా తెలివితేటలు నాకు పనికిరావు. ఇతరులకు సలహాలివ్వడానికి పనికివస్తాయి. ఆయన్ని మార్చాలని నా జీవిత మంతా పోరాడాను. ఉహూ!! రాయిని మార్చ చ్చుకానీ ఆయన్నిమటుకు కదిలించలేం!" ఆదిలక్ష్మి చెప్పింది.

"నీ అదృష్టమమ్మా నాన్న లాంటి భర్త లభించడం! ఒక్క దురలవాటు లేదు... ఏమీ ఆశించడు. ఎవర్నీ ఏదీ దేబిరించడు" సీత చెప్పింది తండ్రిని వెనకేసుకొస్తూ.

"అదేగదమ్మా నా బాధ! ఊరందరిదీ ఒక దోవ అయితే ఉలిపికట్టెది మరో దోవ అని - దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోమన్నారు - ఆయన వింటేగా - ఇంక ఎంతకాలం లేవ మ్మా నాకు ఈ బాధలు - మీ యిద్దరికీ పెళ్ళిళ్ళు అయిపోయి - వాడికి ఉద్యోగం వస్తే - కృష్ణారామా అనుకుంటూ జీవితాన్ని వెళ్ళబుచ్చ వచ్చు" ఆదిలక్ష్మి చెప్పింది.

"దేవుడు మనకు ఈమాత్రం యిచ్చాడు లక్ష్మీ. అది కూడా లేనివాళ్ళు ఎంతమంది లేరు? చాలు... ఈ మాత్రం ఉన్నందుకు మనం ఆయనకు కృతజ్ఞులమై ఉండాలి" చెప్పాడు శ్రీమన్నారాయణ.

✪ ✪ ✪

కాలం గిర్రున తిరిగి పోయింది గడియా

రంలోని సెకండ్ల ముల్లులాగా.

ఏడాది దాటింది...

శ్రీమన్నారాయణ పడకకుర్చీలో విశ్రాంతి తీసుకుంటున్నాడు.

సీతకు పెళ్ళి అయింది. వైజాగ్‌లో ఉం టోంది.

గీతకు కూడా పెళ్ళి అయింది - చెన్నైలో ఉంటోంది.

సుధాకర్ అమెరికా వెళ్ళిపోయాడు - అక్కడ పెట్రోల్ బంకులో పనిచేస్తూ యమ్మెస్ చేస్తున్నాడు - తన పొట్ట తను పోషించుకుం టూ - తన ఫీజులు తను కట్టుకుంటున్నాడు. కాకపోతే బ్యాంకు లోను తీర్చాల్సి ఉంది.

రిటైర్‌మెంట్ బెనిఫిట్లన్నీ ఖర్చయిపోయి - నెలకు వచ్చే పెన్షన్ డబ్బులతో కాలక్షేపం చేస్తున్నాడు శ్రీమన్నారాయణ - కర్నూలు నగరంలో.

ఓ చిన్న ఇల్లు కొనుక్కొని అద్దె లేకుండా జీవితాన్ని లాగిస్తున్నాడు - అదీ ఊరికి దూ రంగా ప్రశాంతమైన వాతావరణంలో. ఆది లక్ష్మిమటుకు ఇప్పటికీ తన భర్త అప్రయో జకత్వానికి విచారపడుతూనే ఉంటుంది.

ఒకరోజు తన కొలీగ్ ఆచారికి సీరియస్‌గా ఉందని తెల్సింది శ్రీమన్నారాయణకు. ఆచారికి యింకా రెండేళ్ళ సర్వీసుంది. కానీ బాగా శ్రీ మంతుడు. ఉద్యోగంలో బాగా సంపాదించి పైకి వచ్చాడని చెప్పుకుంటారు. ఇద్దరూ మొగపిల్లలే - ముంబైలో మంచి ఉద్యోగాల్లో ఉన్నారు.

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో ట్రీట్‌మెంటు తీసుకుంటున్నాడు ఆచారి. శ్రీమన్నారాయణను చూడగానే ఆనందంగా నవ్వాడు మంచం మీంచే!

"ఆచారీ! బాగున్నావా?" ఆప్యాయంగా అడిగాడు శ్రీమన్నారాయణ.

"ఏం బాగు - స్ట్రోక్ వచ్చింది. కుడికాలు - కుడిచెయ్యి బాధగా ఉన్నాయి" చెప్పాడు.

"ఎన్నాళ్ళయింది?"

"ఓ వారం రోజుల క్రిందట... నిద్రలోంచి లేచి బాత్‌రూమ్‌కి వెళ్దామని ప్రయత్నించి పడిపోయాను. మా ఆవిడ యిక్కడకు తెచ్చిం ది..." చెప్పాడు.

"ఇప్పుడు బాగుందా?"

"ఫరవాలేదు కొంచెం ఆలస్యంగా వచ్చి ఉంటే... ఏమయ్యేదో!"

ఆచారిని అనునయిస్తూ ఉన్నాడు శ్రీమన్నా రాయణ.

గది బయట ఆదిలక్ష్మి ఆచారి భార్య ప్రమీ లమ్మతో మాట్లాడుతోంది.

"ఇప్పుడు బాగుందా?"

"ఏం బాగు? - ఆ కాలు, చెయ్యా ఎప్పుడు వస్తుందో - అప్పటిదాకా అన్నీ మంచంలోనే - చేయలేక ఛస్తున్నా!" ఏడ్చింది ప్రమీలమ్మ.

"అసలు ఎందుకు వచ్చింది?"

"టెన్షన్! ఆఫీసులో పని ఎక్కువ. ఎప్పుడూ డబ్బుయావ. ఆలోచనలు ఎక్కువైతే బిపీ వ స్తుంది - అది వచ్చిందంటే ఇక అన్ని రోగాలూ వస్తూ ఉంటాయి. సంపాదించింది చాల్లెండి... మనకెందుకు - పిల్లలిద్దరూ మంచి ఉద్యోగాల్లో ఉన్నారు అంటే - వింటేగా నామాట!" చెప్పింది ప్రమీలమ్మ.

"అవును - మీకు ఏ బరువు బాధ్యతలూ లేవు - బోల్డు ఆస్తి సంపాదించారు అన్నయ్య గారు - ఇంకా ఎందుకు తాపత్రయం!?" ఆశ్చ ర్యంగా అడిగింది.

"రిటైర్ అయింతర్వాత ఎలాగూ సంపాదించలేం - ఇప్పుడే వెనకేసుకోవాలని ఒకటే తాపత్రయం! నేను చెబుతూనే ఉన్నా... మన కింత కంటే ఏం కావాలండీ! మనం ఏం పట్టుకుపోతాం? మన ఆస్తి మన పిల్లలకి కూడా అక్కరలేదు - వాళ్ళు బాగా సంపాదిస్తున్నారు అని చెబితే వింటేగా?" వాపోయింది ప్రమీలమ్మ! "చూడు ఆదిలక్ష్మీ! ఈ డబ్బు పిచ్చి ఉంది చూశావూ... అది మహాచెడ్డది - ఎంత సంపాదించినా దాహం తీరదు - ఇంకా ఇంకా సంపాదించాలనే ఉంటుంది - దానికి తృప్తి కాని - హద్దు కానీ ఉండదు - అది తెల్సుకోకుండా గానుగెద్దు జీవితాన్ని గడుపుతారు చాలామంది".

"అయితే సంపాదన వేస్టు అంటావా ప్రమీలమ్మా!" ఆదిలక్ష్మి అడిగింది.

"ఉండాల్సిందే! ఎంతవరకు? మనం సుఖంగా బ్రతికినంత ఉంటే చాలు - ఇంకా - ఇంకా సంపాదించి ఏం చేసుకోవాలి? ఈయనకు అన్నీ ఉన్నాయి - కారుంది - ఇల్లుంది - పిల్లలున్నారు - భార్య ఉంది. కాని ఇప్పుడు ఆయనకు అనుభవించే దానికి ఆరోగ్యం లేదు. తనకి షుగరు వచ్చి పదేళ్ళు దాటింది. తీపి తినకూడదు. బిపీ వచ్చి కూడా చాలా కాలమైంది - ఉప్పు, కారం తగ్గించాలి. అసిడిటీ ఉంది - పులుపుపడదు - కారం పడదు. కడుపుకు తినడానికి కూడా లేకుండా ఎందుకోసం సంపాదన? - ఎవరికోసం?" ప్రమీలమ్మ ఆవేదనగా చెప్పింది.

"నిజమే కానీ నీ మెళ్ళో ఈ నగలు - ఈ పట్టువస్త్రాలు సంపాదించకపోతే వచ్చేవా?" ఆదిలక్ష్మి నిలదీసింది.

"నిజమే! కానీ ఇవేవీ నాకు నా భర్త యిచ్చినంత ఆనందాన్ని యివ్వలేవు కదా! నీకో సంగతి చెప్పనా - మేమిద్దరం ఆనందంగా కలిసి బ్రతికి పదేళ్ళు దాటింది - ఎప్పుడూ ఏదో టెన్షన్! పిల్లల చదువులు - పెళ్ళిళ్ళు - ఎత్తిపోతలు - మనవలు - మనవరాళ్ళు - అన్నీ తలకాయనెప్పులే! తనంటూ సుఖపడింది ఎప్పుడు? సుఖం సంపాదనలో లేదు అని చెబితే ఆయన వింటేగా? ఇన్‌కంటాక్సు వాళ్ళ రైడింగులు - ఏసీబీ వాళ్ళ రైడింగులు - వాళ్ళకు మామూళ్ళు - ఎంత సంపాదించినా - అందరికీ భయపడుతూ బ్రతకాలి!" అంది ప్రమీలమ్మ.


"కానీ ఇంత ఖరీదైన ట్రీట్‌మెంట్ యిప్పిస్తున్నావంటే - అది ఆయన సంపాదన వల్లనే కదా! మాలాంటి వాళ్ళు ఈ హాస్పిటల్లోకి కూడా అడుగుపెట్టలేరు కదా!" అడిగింది ఆదిలక్ష్మి.

"అసలు అన్నయ్యలాంటి వాళ్ళకు రోగాలు ఎందుకొస్తాయి? సంపాదన అనేదే పెద్దరోగం! దాని వెంబడి యింకా పెద్ద రోగాలు వస్తాయి. తృప్తి అనేది ఆరోగ్యం - ఇంక ఏ జబ్బూ రాదు దాని వెంట" ప్రమీలమ్మ చెప్పింది.

ఆచారి డిశ్చార్జి అయిన చాలా రోజుల తర్వాత వాళ్ళింటికి మళ్ళీ వెళ్ళారు. "ఈ జీవితం కంటే చావు నాకు తొందరగా వస్తే బాగుంటుంది" ఆచారి మంచం మీంచి లేవడానికి ప్రయత్నిస్తూ చెప్పాడు.

"పడుకోండి అన్నయ్యగారూ - మీ ఆరోగ్యం బాగుందా? తొందరలోనే నయం అవుతుంది" చెప్పింది ఆదిలక్ష్మి.

"నాకు తెలీదా? ఈ జబ్బుకు నయం అంటూలేదు. బ్రతికినంత కాలం అవిటి వాడిలాగా ఒకళ్ళపైన ఆధారపడి బ్రతకాల్సిందే!"




"అది కాదు ఆచారీ! చాలామంది ఆయుర్వేదం తీసుకుంటూ ఉంటారు - నువ్వు కూడా ప్రయత్నించవచ్చుగదా!" సలహా యిచ్చాడు శ్రీమన్నారాయణ.

"అన్ని ప్రయత్నాలూ అయిపోయాయి - మనకి ఒక జబ్బుంటే గదా నయంకావడానికి - అన్నీ ఉన్నాయి - పథ్యం పాటించాలి - నోరు కట్టుకుపోయి - చూస్తూ చూస్తూ ప్రాణాలు తీసుకోలేము - ఆనందంగా బ్రతకలేము" చెప్పాడు ఆచారి.

పులిలాగా ఉండే ఆచారి బోనులో పడ్డట్టు - మంచానికి అతుక్కుపోయి ఉంటే శ్రీమన్నారాయణకు గుండె చెరువైంది.

ఇల్లు వైభవంగా ఉంది. అనుభవించే కొడుకులు, కోడళ్ళూ దూరంగా ముంబైలో ఉన్నారు - తను నాలుగడుగులు నడవలేడు - ప్రమీలమ్మకు భర్త మీద ధ్యాస తప్ప యింక వేరే ప్రపంచం లేదు.

హృదయం తరుక్కుపోయింది.

భారమైన హృదయాలతో వచ్చేశారు.

ఆ తరువాత శ్రీమన్నారాయణ - ఆదిలక్ష్మి దంపతులు చెన్నైకి, వైజాగ్‌కీ చాలాసార్లు తిరగాల్సి వచ్చింది. సీత, గీతలకు పిల్లలు పుట్టారు. పురుళ్ళు, నామకరణాలు - అనారోగ్యాలు - పసిపిల్లల్ని కాపలాకాయడం... వీటితో ఒక సంవత్సరంపైనే పట్టింది మళ్ళీ కర్నూలులో ప్రశాంతమైన జీవితం గడపడానికి.

కొంచెం వీలు చూసుకుని ఆచారి దంపతులు ఎలా ఉన్నారో చూద్దామని వారింటికి వచ్చారు.

ఎక్కడా ఆచారి నేమ్‌బోర్డు కనబడలేదు. ఆ ఇంటిముందు 'రంగాచారి అనాధాశ్రయశాల' అని బోర్డు వ్రేలాడుతోంది.

"ఇల్లు అమ్ముకుని హైదారాబాద్‌కి వెళ్ళిపోయాడా ఆచారి?" అనుమానంగా అడిగాడు భార్యను.

"బ్రహ్మాండంగా కట్టుకున్న ఇల్లు - ఎంత

తెలివి తక్కువవాళ్ళయినా అమ్ముకుంటారా?" లక్ష్మీదేవి ఆశ్చర్యపోయింది.

భారమైన మనసులతో వెనక్కి తిరుగుతూ ఉంటే ఓ పరిచితమైన కంఠం పిలుపు వినిపించింది.

"లక్ష్మీదేవీ - మర్చిపోయారా?" వెనక్కి తిరిగి చూసింది.

వరండాలో రంగాచారి గారు నిలబడి ఉన్నారు.

"స్వామీ - మీరు ఇక్కడ?" ఆశ్చర్యంగా అడిగింది.

"లోపలికి రండి - మాట్లాడుకుందాం-" రంగాచారి హాల్లోకి నడిచారు.

ఓ పెద్దహాలు - అక్కడో చెక్కకుర్చీ - చెక్క కుర్చీలు, దర్భపుల్లల చాప! వెనకాల నిలువెత్తు దేవుడి ఫొటోలు.

ఆయన కుర్చీ ముందు చాపలు పరిచి ఉన్నాయి.

చాపల మీద కూర్చున్నారు ఆదిలక్ష్మి, శ్రీమన్నారాయణ.

"మీరు ఈ ఇల్లు కొన్నారా?" ఆశ్చర్యంగా అడిగాడు శ్రీమన్నారాయణ.

"లేదు... ఆచారి పిల్లలు నన్ను ఇక్కడ పెట్టి వెళ్ళారు ముంబైకి".

"ఆచారిగారు ఎక్కడున్నారు?" లక్ష్మీదేవి అడిగింది.

మౌనంగా వేలు పైకి ఎత్తి చూపించారు.

"అయ్యో! ప్రమీలమ్మగారు ముంబైకి వెళ్ళిపోయారా?" అడిగాడు.

మళ్ళీ రంగాచారిగారు చేతులు ఆకాశంలోకి చూపారు.

"నిజమా? అన్నయ్యగారు - వదినగారూ స్వర్గస్తులయ్యారా? ఎలా?" ఆదిలక్ష్మి ఆందోళనగా అడిగింది.

"ఏం చెప్పమంటారు? అంత ఆస్తిపాస్తులు సంపాదించి - అధికార దర్పంతో - ఐశ్వర్యంతో జీవించిన ఆచారికి మంచం మీద ఎల్ల కాలం ఉండటం యిష్టంలేకపోయింది. ఓ రోజు ఓ ఉత్తరం రాసి ఆత్మహత్య చేసుకున్నాడు - అది చదివి - ఆ శవాన్ని చూసి దెబ్బతిన్న ప్రమీలమ్మ పిల్లలకు ఫోన్‌చేస్తూ కుప్పకూలిపోయింది - ఇద్దరి శవాలనూ చూసిన వాచ్‌మేన్ భయపడి పారిపోయాడు కేసు ఏదన్నా తనమీద కొస్తుందని. ఇరుగు పొరుగు చూసి పోలీసులకు ఫోన్ చేశారు - పిల్లలు వచ్చేలోగా ఎవరి చేతికందింది వాళ్ళు దోచుకున్నారు. విలువైన నగలు, ఆభరణాలు - వస్తువులు - దొంగలపాలయ్యాయి.

ఆయన పిల్లలు వచ్చి అంత్యక్రియలు జరిపి - విరక్తి పుట్టి - నన్ను సంప్రదించి అనాధాశ్రమం పెట్టమన్నారు ఇక్కడ!" చెప్పారు.

"చివరికి అంత సంపాదించి దిక్కులేని చావు చనిపోయాడు" బాధగా అన్నాడు.

"అందుకే అంటారు... ఎవరు చేసిన కర్మ వారు అనుభవించాలి! అన్యాయంగా సంపాదించిన ఆస్తి అన్యాక్రాంతమవుతుంది" రంగాచారిగారు చెప్పారు.

"ఎవరూ ఏమీ కట్టుకుపోరు - బ్రతికినంత కాలం ధర్మంగా బ్రతికితే చాలు!"

"కానీ ఈ విషయం ఎంతమందికి తెలుసు?" శ్రీమన్నారాయణ అడిగాడు.

"స్వానుభవంతో కానీ తెలుసుకోలేం? అప్పటికి మన చేతుల్లో ఏమీ ఉండదు" ఆదిలక్ష్మి చెప్పింది మనస్ఫూర్తిగా.